Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 337 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 18 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com

RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## ఏడు ప్రతినిధి బృందాలు.. టీమ్ లీడర్లు వీరే..





**న్యూఢిల్లీ:** ఉగ్రవాదుల బండారాన్ని బయటపెట్టేందుకు, ఉగ్రకుట్రల్ని అందరికీ విశదీకరించేందుకు భారత ప్రతినిధులను విదేశాలకు మోదీ సర్కార్ పంపుతోంది. ఇందుకోసం 7 అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఆ టీమ్‌లను లీడ్ చేసే నాయకుల పేర్లను కూడా ప్రకటించింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలకు వివరించేందుకు ఎంపీల లిస్ట్ పంపాలంటూ అన్ని పార్టీలను కేంద్రం కోరింది. అనంతరం ప్రతినిధుల బృందం జాబితాను ప్రకటించింది. మే ద్వితీయార్థంలో ఈ టీమ్‌లు విదేశాలకు వెళ్లనున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన క్రమంలో ఈ తాజా పరిణామం చోటు చేసుకుంది. కాగా, కేంద్రం ప్రకటించిన ఏడు ప్రతినిధుల బృందాలకు ఏడుగురు పార్లమెంట్ సభ్యులు సారథ్యం వహించనున్నారు. కాంగ్రెస్ నుంచి శశిథరూర్, బీజేపీ నుంచి రవిశంకర్ ప్రసాద్, జేడీయూ నుంచి సంజయ్ కుమార్ ఝా, బీజేపీ నుంచి బైజయంత్ పాండా, డీఎంకే నుంచి కనిమొళి, ఎన్‌సీపీ నుంచి సుప్రియా సూలే, శివసేన నుంచి శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే పేర్లను ప్రకటించారు. అమెరికా ప్రతినిధి బృందానికి శశిథరూర్, రష్యా ప్రతినిధి బృందానికి కనిమొళి, ఆఫ్రికా ప్రతినిధి బృందానికి శ్రీకాంత్ షిండే, గల్ఫ్ దేశాలకు రవి శంకర్ ప్రసాద్ నేతృత్వం వహిస్తారు. అమెరికా ప్రతినిధి బృందానికి శశిథరూర్ నాయకత్వం వహించనుండగా, టీమ్‌లో శాంభవి చౌదరి, సర్ఫరాజ్ అహ్మద్, సుదీప్ బందోపాధ్యాయ్, హరీష్ బాలయోగి, శశాంక్ మణి ప్రతిపాఠి, భువనేశ్వర్ కలిత, మిలంద్ దేవర ఉన్నారు. వీరితో పాటు అమెరికాకు మాజీ రాయబారి రణ్‌జిత్ సింగ్ సంధు, ఐఓఆర్ డెర్కటర్ వరుణ్ జెఫ్ కూడా ఉన్నారు. ఏడు ప్రతినిధి బృందాలలో నాలుగింటికి అధికార ఎన్డీయే, మూడింటికి విపక్ష ఇండియా కూటమి సారథ్యం వహించనున్నాయి. ఒక్కో డెలిగేషన్ సుమారు ఐదు దేశాల్లో పర్యటిస్తుందని, ప్రతి టీమ్‌తోనూ పలువురు ప్రముఖ దౌత్యవేత్తలు ఉంటారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## రెడ్ శాండల్ టాస్క్ ఫోర్స్ ఆర్ఎస్ఐపై కేసు

**తిరుపతి, (రాజధాని వార్తలు):** రెడ్ శాండల్ టాస్క్ ఫోర్స్ ఆర్ఎస్ఐ విశ్వనాథ్‌పై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. గత మూడేళ్లుగా వేధింపులకు గురిచేస్తూ... తన కాపురంలో గొడవలు పెడుతున్న విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని టీటీడీ ఉద్యోగి భార్య ఫిర్యాదు చేసింది. విశ్వనాథ్ చెప్పినట్లుగా వినకపోతే తన భర్తను చంపేస్తానని ఫోన్‌లో బెదిరింపులకు దిగాడని బాధితురాలు పేర్కొంది. జనవరిలో స్నేహితులతో కలసి తన భర్తపై దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో తెలిపింది. కాగా వేధింపులతో పాటు ఆర్ఎస్ఐపై అవినీతి ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఆయనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఆర్ఎస్ఐపై అవినీతి ఆరోపణలు ఉన్నా.. ఉన్నతాధికారులు అతనిని రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్‌లోనే కొనసాగిస్తున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన వైసీపీ నేత, ఎర్రచందనం స్మగ్లర్ విజయానంద రెడ్డి అండదండలతో టాస్క్ పోర్స్‌లో విశ్వనాథ్ పోస్టు దక్కించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2022లో తనను ఆర్ఎస్ఐ విశ్వనాథ్ వేధిస్తున్నాడని బాధితురాలు అలిపిరి పోలీసులకు పిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పిర్యాదును బుట్టదాకలు చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో విశ్వనాథ్ ఇంకా రెచ్చిపోయి మూడేళ్ళుగా తన కుటుంబాన్ని వేధిస్తున్నాడని ఆమె తెలిపింది. కాగా తన భార్య మొబైల్‌కు అసభ్యకరమైన వీడియోలు పంపిన ఆర్ఎస్ఐపై ఆమె భర్త తట్టుకోలేక.. ఆగ్రహం వ్యక్తం చేస్తూ విశ్వనాథ్‌కు దేహశుద్ధి చేశాడు. మరోవైపు వివాహిత పిర్యాదు మేరకు ఈ నెల 9న అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదు చేసి వారం రోజులు గడిచినా ఆర్ఎస్ఐపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మరోవైపు ఈ కేసులో రాజీకి రావాలని ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం.




## నీ విజయం దేశానికే గర్వకారణం.. నీరజ్‌పై సీఎం ప్రశంసల జల్లు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ టోర్నీలో 90 మీటర్ల జావెలిన్ విసిరి చరిత్ర సృష్టించిన జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రాకుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన సాధించిన ఈ ఘనత ఎంతో గర్వకారణం అంటూ ప్రధాన నరేంద్ర మోదీ సహా రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీరజ్ చోప్రా విజయంపై స్పందించారు. ఇంతటి ఘనత సాధించిన నీరజ్‌కు హృదపూర్వక అభినందనలు తెలిజేశారు. ఈ విజయం దేశానికి గర్వకారణమని చెప్పుకొచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు.

**చంద్రబాబు ట్వీట్**

నీరజ్ చోప్రా మరోసారి తన పేరును చరిత్ర పుటల్లో లిఖించారు. 90 మీటర్ల మార్కు కంటే ఎక్కువ దోహా డైమండ్ లీగ్‌లో జావెలిన్ విసిరి దేశం గర్వించేలా చేశారు. నీరజ్‌కు ఈ ఘనత సాధించినందుకు హృదయపూర్వక అభినందనలు. ఈ మైలు రాయిని దాటడం ద్వారా భారత్ క్రీడా ప్రతిభ ప్రపంచానికి తెలుస్తుంది. నీరజ్ సాధించిన విజయం దేశానికే గర్వకారణం అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. కాగా.. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న లక్ష్యాన్ని ఛేధించాడు జావెలిన్ త్రో స్టార్ నీజర్ చోప్రా. దోహాలో జరిగిన డైమండ్ లీగ్ టోర్నీలో జావలిన్‌ను 90.23 మీటర్ల దూరం విసిరి చరిత్రలో నిలిచాడు. తొలి ప్రయత్నంలోనే ఈటెను 88.44 మీటర్ల దూరం విసిరిన నీరజ్.. ప్రధాన ప్రత్యర్థులు అండర్సన్ పీటర్స్, జులియన్ వెబర్‌లకు గట్టి పోటీని ఇచ్చాడు. రెండో రౌండ్‌లో ఫౌల్ చేసిన భారత్ జావెలిన్ త్రో స్టార్.. మూడో రౌండ్‌లో మాత్రం ఏకంగా 90.3 మీటర్ల దూరంలో ఈటెను విసిరి అరుదైన మైలు రాయిని చేరుకున్నాడు.

## ప్రతి నెలా మూడో శనివారం శుభ్రతపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు పిలుపు




**అమరావతి, (రాజధాని వార్తలు):** రైతన్నలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. కేంద్రం ఇచ్చే కిసాన్ నగదుకు సరిసమానంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ క్యాంప్ రైతుబజార్‌కు ఆయన వెళ్లారు. అక్కడ రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. కూరగాయల వ్యర్థాలతో ఎరువుల తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం ధనలక్ష్మి నగర్‌లో ఉద్యానవన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించాలంటూ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతినెలా మూడో శనివారం ఇళ్లు, పరిసరాల్లోని శుభ్రతపై దృష్టి పెట్టాలని కోరారు. కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్న చంద్రబాబు.. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ మేరకు ప్రజలతో ప్రమాణం చేయించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించాలని ప్రజలకు సూచించారు. ఉద్యోగులు సైతం ప్రతి మూడో శనివారం శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ప్రపంచం మెచ్చుకునేలా రాష్ట్రంలో యోగా కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు చంద్రబాబు తెలిపారు. కర్నూలులోని రైతుబజార్‌కు రూ.6 కోట్లు కేటాయించి ఆధునికీకరిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కర్నూలు ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకా ఏం మాట్లాడారంటే.. "రాష్ట్రంలో 125 రైతు బజార్‌లు ఉన్నాయి. కాలక్రమంలో వాటిపై దృష్టి పెట్టలేదు. వీటిని ఆదర్శ రైతు బజార్‌లుగా తయారు చేస్తాం. 175 నియోజకవర్గాల్లో 175 రైతు బజార్‌లు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర, ప్రజలకు సరసమైన ధరలకు కూరగాయలు అందిస్తాం. మూడో శనివారం ఎవరూ ఆఫీసుల్లో పని చేయొద్దు. ఆఫీసును శుభ్రం చేసి పచ్చని చెట్ల కింద విశ్రాంతి తీసుకోవాలి. వైజాగ్‌లో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ప్రపంచం మెచ్చేలా నిర్వహిస్తాం. సెల్ ఫోన్ ప్రభావం వల్ల పిల్లలు, పెద్దలు అనారోగ్యానికి గురవుతున్నారు. యోగా వల్ల ఆరోగ్యంగా ఉంటారు." అని చంద్రబాబు అన్నారు. "ప్రపంచంలో ఏదీ వేస్ట్ కాదు. ప్రతి ఒక్కటీ విలువైనదే. తడి చెత్త, పొడి చెత్త కాన్సెప్ట్‌ను తీసుకొచ్చి పవర్ గ్రిడ్‌కు శ్రీకారం చుట్టాను. ప్రస్తుతం ఇవి రెండు ఉన్నాయి. గత ప్రభుత్వం 84 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రోడ్లపై వదిలేసింది. మంత్రి నారాయణను అక్టోబర్ రెండో తేదీ నాటికి ఆ చెత్తను తొలగించాలని ఆదేశించా. ఇప్పటివరకూ రోడ్లపై 54 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారు. మెప్మా డ్వాక్రా సంఘాలను సమన్వయం చేస్తా. సుధారాణి అనే మహిళ మిద్దె తోటలపై ప్రపంచవ్యాప్తంగా విప్లవం తీసుకొచ్చారు. డ్వాక్రా సంఘాల ద్వారా ప్రపంచానికి ఆడ బిడ్డల శక్తి ఏమిటో తెలియజేశాం. చెత్త నుంచి కంపోస్టు ఎరువులను తయారు చేసి రైతులకు సప్లై చేసే బాధ్యత డ్వాక్రా సంఘాలకు అప్పగిస్తున్నా." అని చంద్రబాబు తెలిపారు. "జపాన్‌లో రోడ్లపై ఎక్కడ చెత్త కనపడదు. రోడ్లపై ఉన్న పేపర్లను ఇంటికి తీసుకెళ్లి డస్ట్ బిన్‌లో వేయడం సామాజిక బాధ్యత. పల్లె పుష్కరిణి అనే కార్యక్ర మం ద్వారా చెరువులు శుభ్రం చేసి చెరువు చుట్టూ పచ్చదనం ఉండేలా చూస్తాం. అనంతపురం జిల్లాలో ఓడిఎఫ్ గ్రామాలు సక్సెస్ అయింది. దేశంలోనే ఎక్కడా లేనిది మన రాష్ట్రంలో త్వరలో పేదల సేవలో అనే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నా. త్వరలోనే దీపం పథకం లబ్ధిదారులకు డబ్బులు అకౌంట్‌లలో జమ చేస్తాం. డిఎస్సీ ద్వారా 16,500 ఉద్యోగాలను స్కూల్‌లు ఓపెన్ చేసేలోపు పూర్తి చేస్తాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంద రికీ పాఠశాలలు తెరిచేలోగా తల్లికి వందనం ఇస్తామని చంద్రబాబు చెప్పారు. "నాకు ఎన్ని కష్టాలు వచ్చినా భరిస్తా.. కానీ ప్రజలకు కష్టాలు రానివ్వను. కేంద్రం రైతులకు ఇచ్చే నగదుకు సమానంగా మూడు విడతల్లో రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేస్తాం. ఆగస్టు 15న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. నేనూ రాయలసీమ బిడ్డనే. రాయలసీమను రతనాల సీమ చేయడమే నా లక్ష్యం. రాయలసీమలో ఒకప్పుడు ఫ్యాక్షన్ సంస్కృతి ఉండేది. దాన్ని కూకటివేళ్లతో పెకిలించా. దీనివల్ల అభివృద్ధికి అవకాశం ఏర్పడింది. రాయలసీమ నాలుగు జిల్లాల్లో నాలుగు ఎయిర్ పోర్టులు ఉన్నాయి. దేశంలో ఎక్కడా నాలుగు జిల్లాల్లో నాలుగు ఎయిర్ పోర్టులు లేవు. త్వరలోనే ఓర్వకల్లు మండలంలోని గ్రీన్ ఎనర్జీ సంస్థ నుంచి దేశవ్యాప్తంగా కరెంటు సరఫరా కానుంది. మండు వేసవిలో కూడా రాయలసీమ చెరువుల్లో నీరు నిండుగా ఉంది. ఇది నా చొరవ. పోలవరం – బనకచర్ల అనుసంధానం గేమ్ చేంజర్ కానుంది. దీని ద్వారా రాయలసీమలోని ప్రతి ఎకరాకు నీరు అందించవచ్చు. ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు నీళ్లు, రైల్వే ట్రాక్ తీసుకొచ్చే బాధ్యత నాది. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 16 వార్డుల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం." అని చంద్రబాబు వెల్లడించారు.

## రీశాట్–1బీ ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభం

**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** దేశ సరిహద్దుల్లో నిఘా సామర్థ్యాన్ని పెంచి, దేశ భద్రతను పటిష్ఠం చేసే అత్యాధునిక రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం రీశాట్–1బీ ప్రయోగానికి ఇస్రో సర్వం సిద్ధం చేసింది. పీఎస్ఎల్వీ–సీ61 ద్వారా ఈఓఎస్–09 (రీశాట్–1బీ) ఉపగ్రహాన్ని కక్ష్యలోకి మోసుకెళ్లనుంది. ప్రయోగానికి సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సుదీర్ఘంగా సమీక్ష జరిగింది. జనవరిలో రోదసిలోకి పంపిన ఎన్‌వీఎస్–02 ఉపగ్రహం సాంకేతిక సమస్యలు ఏర్పడి నిర్ణీత కక్ష్యలోకి వెళ్లలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పీఎస్ఎల్‌వీ–సి61 ప్రయోగంలో ప్రతి అంశాన్ని శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటున్నారు.

**ఆదివారం ఉదయం 5:59 గంటలకు ప్రయోగం..**

శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ వేదికగా ఆదివారం ఉదయం 5:59 గంటలకు పీఎస్ఎల్వీ–సీ61 రాకెట్ ద్వారా ఈవోఎస్–09 (రీశాట్–1బీ) ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనుంది. ఈ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ శనివారం ఉదయం 7:59 గంటలకు ప్రారంభమైంది. 22 గంటలపాటు కొనసాగే ఈ కౌంట్‌డౌన్ ముగిసిన వెంటనే షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ–సీ61 రాకెట్ నింగిలోకి దూసుకెళ్తుంది. నాలుగు దశల అనుసంధాన పనులు పూర్తి చేసుకుని ప్రయోగ వేదికపైనున్న పీఎస్ఎల్వీ–సీ61 రాకెట్‌కు శాస్త్రవేత్తలు శుక్రవారం తుది పరీక్షలు నిర్వహించారు. ఇక, పీఎస్ఎల్వీ–సీ61 రాకెట్ నమూనాను ఇస్రో చైర్మన్ నారాయణన్... శ్రీవారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని నారాయణన్ శాస్త్రవేత్తలతో కలిసి దర్శించుకున్నారు. పీఎస్ఎల్వీ–సీ61 ప్రయోగం విజయవంతం కావాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రీశాట్–1బీ ఉపగ్రహంలో అమర్చిన సీ–బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్ (సార్) ప్రత్యేకత. ఈ రాడర్ సహాయంతో పగలు, రాత్రి.. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా భూ ఉపరితలాన్ని హై–రిజల్యూషన్ చిత్రాలను తీసి పంపుతుంది. ఇటీవల భారత్–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితులు నెలకొన్న సమయంలో భారత సైనిక దళాలకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుంది. దేశ భద్రత, సైనిక అవసరాలకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించడంలో రీశాట్–1బీ కీలకం కానుంది. ఉగ్రవాదుల స్థావరాలు, వారి కదలికలను పసిగట్టడంతో పాటు, సరిహద్దు ప్రాంతాలలో శత్రువుల బలగాలకు సంబంధించిన కార్యకలాపాలను కూడా నిశితంగా పరిశీలించి.. హై రిజల్యూషన్ ఫొటోలను తీసి పంపుతుంది.



# సప్లి పరీక్షలు పరిశీలించిన డిఐఈడి



**సామర్లకోట,(రాజధాని వార్తలు):** సామర్ల కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల, జరుగుతున్న ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణను శుక్రవారం కాకినాడ జిల్లా డైడ్ డిఐఈడి ఐ శారద సందర్శించి పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణ ప్రశాంతంగా జరుగుతున్నట్లు ఆమె గుర్తించి పరీక్షల నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు పర్యవేక్షించారు. ఇలా ఉండగా శుక్రవారం సామర్లకోటలో 353 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా ఒకేషనల్ సబ్జెక్టులు, ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 11 విద్యార్థులు గైర్హాజరు అయినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సి హెచ్ ఎల్ శ్రీదేవి డిఐఈడి శారదకు వివరించారు.

# ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు పది రోజులు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 10వ రోజుకు చేరుకుంది. సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాంకేతిక నిపుణత కలిగిన కార్మికులకు రూ. 29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ. 24,500 వేతనాలు ఇవ్వాలని, 15 సంవత్సరాల సర్వీసు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 10 లక్షలు పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, సీనియారిటీ ప్రకారం వేతనాల చెల్లింపులు జరపాలని, సంక్షేమ పథకాలు, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రామరాజు, కృష్ణ, రత్నరాజు, రమేష్, మురళీకృష్ణ, సత్యనారాయణ, భూదేవి, నాగార్జున, వెంకటేశ్వరరావు, స్వామి, రాజేష్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యానికి సంఘీభావం

## - గడియారం సెంటర్ నుండి నల్ల వంతెన వరకు జాతీయ జెండా చేతబూని భారీ ర్యాలీ







**అమలాపురం, (రాజధాని వార్తలు):** పహాల్గాం దారుణ మారణ కాండలో ప్రాణాలు కోల్పోయిన భారతీయులు, సైనికులు.. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం సాధించిన విజయానికి మద్దతుగా దేశవ్యాప్తంగా చేపడుతున్న "తిరంగ యాత్ర"లో భాగంగా స్థానిక ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గడియార స్తంభం సెంటర్ నుండి నల్లవంతెన వరకు "తిరంగ యాత్ర" త్రివర్ణ పతాకాన్ని చేతబూని భారత్ మాతాకు జై అంటూ నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతాకీ జై, ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేసారు.

ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, రెడ్డి సుబ్రహ్మణ్యం, నల్లా పవన్, మోకా సుబ్బారావు, అడబాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కల్వకొలను తాతాజీ, నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, గండి స్వామి, పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి విజయలక్ష్మి, వలవల శివరావు, మంథా ఫణి, దంతులూరి వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర విజయవంతం చేయాలి





**అల్లవరం, (రాజధాని వార్తలు):** ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులను కోరారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నేడు 3వ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా వేసవి వేడిని, వడగాల్పులను ఎదుర్కోవడం అనే అంశంకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజల్లో వడ దెబ్బ తగలకుండా ఉండేందుకు టోపీ ధరించడం, తరచూ నీరు త్రాగడం, నీడలో ఉండడం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించాలని మండలంలోని 21 పంచాయతీలలో ఈ అంశాన్ని తప్పనిసరిగా నిర్వహించి ప్రజలను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే చైల్డ్ ఆధార్ నమోదు, వాహన ఆధార్, మ్యాపింగ్‌పై దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఏ ఓ బి లక్ష్మణ రావు, జె ఏ సుబ్బలక్ష్మి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో ఘర్షణ...!

## - పరస్పర దాడుల్లో 20 మందికి గాయాలు





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం జి రాగంపేట గ్రామంలో శుక్రవారం జరిగిన వివాహ వేడుకలో ఘర్షణ చోటు చేసుకుంది. పెళ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె బంధువుల మధ్య డిజే పాటల విషయంలో వచ్చిన మనస్పర్థలు కారణంగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కర్రలతో దాడికి దిగగా సుమారు 20 మందికి గాయాలయ్యాయి.

జి.రాగం పేటకు చెందిన పెళ్లి కుమా రుడికి, ఐ పోలవరం మండలం ఎదురులంక పంచాయతీ గుత్తుల వేమవరం గ్రామానికి చెందిన పెళ్లి కుమార్తెకు శుక్రవారం జి రాగంపేటలో వివాహ కార్యక్రమం జరిగింది. అయితే డీజె పాటల విషయంలో తొలుత ఇరు వర్గాల మధ్య తోపులాట ప్రారంభమై అది ఘర్షణకు దారి తీసింది.

దానితో పరస్పర దాడులు జరగగా ఈ దాడుల్లో సుమారు 20 మందికి తీవ్ర, స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ దాడుల్లో పెళ్లి కుమార్తె బంధువులు వచ్చిన బస్సు పాక్షికంగా దెబ్బతింది. ఈ వివాదంతో మహిళలు, పిల్లలు భయంతో ఆహాకారాలు చేశారు. విషయం తెలిసి పెద్దాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివాదాన్ని సద్దుమణి గించారు. భాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపించి వైద్య సేవలు అందించారు. ఈ వివాదంపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తూకాలు, బిల్లుల విషయంలో జాగ్రత్తలు అవసరం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** బంగారు వస్తువులు తయారు చేసే వ్యాపారులు తూకాలు, బిల్లుల విషయంలో అన్ని విధాలా జాగ్రత్తలు పాటించాలని పెద్దాపురం డివిజన్ వినియోగ దారుల సంఘం అధ్యక్షులు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బి సూర్యనారాయణ మూర్తి సూచించారు. విశ్వబ్రాహ్మణ వర్తకుల కళ్యాణ భవనంలో లీగల్ మెట్రాలజీ వారోత్సవాల సందర్భంగా పెద్దాపురం డివిజన్ వినియోగదారుల సంఘ అధ్యక్షులు డిసిపిసి సభ్యులు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బి సూర్యనారాయణ మూర్తి అధ్యక్షన ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బంగారం వస్తులను తయారుచేసి అమ్మునపుడు బిల్లులో పూర్తి వివరాలు, తూకం రేటు విడివిడిగా చూపించాలని, తూకం వేసే మిషన్లు రెన్యులు చేయించుకోవాలని, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ తూకాలు కొనేటప్పుడు ఐఎస్ఐ మార్కు ఉన్నవే కొనుక్కోవాలన్నారు. దానికి బిల్లు తప్పక తీసుకోవాలని, గ్యారంటీ కార్డు తీసుకోవాలన్నారు. తేడా వస్తే కన్స్యూమర్ కమిషన్‌లో పిర్యాదు చేసి న్యాయం పొందవచ్చునన్నారు మెట్రాలజీ ఇన్స్పెక్టర్ వి మోహన్ మాట్లాడుతూ నమ్మకమైన నగలు, బంగారం రేటు కలిపిన వస్తువుల ధర విడిగా చూపించాలని, తూకాలలో గాని, బంగారంలో గాని, తేడా రాకుండా జాగ్రత్త పడాలని, తేడాలు వస్తే కేసులు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని బంగారు వ్యాపారులు, ఇతర వ్యాపారులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ యువకుడు మృతి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** చికిత్స పొందుతూ సామర్లకోట పట్టణం గణేష్ కాలనీకి చెందిన పిట్ట రాజేష్ (23) మృతి చెందాడు. 20 రోజుల క్రితం సామర్లకోట బ్రౌన్ పేట సెంటర్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్క్ ఎదురుగా పిఠాపు రం మెయిన్ రోడ్డు ప్రక్కన మూత్ర విసర్జన చేస్తున్న మృతుడు పిట్ట రాజేష్ వీడియోలను తీసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని కొందరు యువకులు రాజేష్‌ను బెదిరించగా మనస్థాపానికి గురైన యువకుడు రాజేష్ గత నెల 25వ తేదీ రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దానితో అప్పటినుంచి అచ్చంపేట మెడికొవర్ ఆసుపత్రిలో 21 రోజుల పాటు మరణంతో పోరాడుతూ గురువారం మృతి చెందాడు. యువకుడు రాజేష్ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియల కార్యక్రమాన్ని బంధువులు చేపట్టారు. కాగా ఈ సంఘటనపై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఖేలో ఇండియా బాడ్మింటన్‌లో హరికృష్ణ ప్రతిభ




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** హైదరాబాద్‌లోని ప్రముఖ బాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సామర్లకోట మండలం అచ్చంపేట (ఆంధ్రప్రదేశ్) కి చెందిన వి హరికృష్ణ టి చరణ్ రామ్‌లు అత్యంత ప్రతిభను కనపరిచారు. మే 13న భాగల్పూర్, బిహార్‌లో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్ బాడ్మింటన్ బాయ్స్ డబుల్స్ విభాగంలో తమిళనాడు కి చెందన నెంబర్ వన్ సీడ్ విశ్వజిత్ రాజ్, నిరంజన్‌పై 19 – 21, 21 – 19, 21 – 16 తేడాతో విజయం సాధించారు. విజేతలను ఖేలో ఇండియా ప్రతినిధులు ఖేలో ఇండియా మెడల్‌తో సత్కరించి అభినందించారు. కాగా ఖేలో ఇండియా బ్యాడ్‌మెంటేన్‌లో ప్రతిభను కనపరచిన సామర్లకోట మండలానికి చెందిన హరికృష్ణకు పలువురు అభినందనలు తెలిపారు.

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు కేకే అభినందన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పదవిని కొత్తపల్లి శామ్యూల్ జవహార్‌కు ఇవ్వడం చాలా శుభపరిణామని ఏఐ ఎండిఎస్ జాతీయ అధ్యక్షులు, తెదేపా నాయకులు కాపవరపు కుమార్ అన్నారు. స్థానిక బళ్ళ మార్కెట్ సెంటర్ లోని కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్‌ను కలిసి అభినందనలు తెలిపినట్టు ఆయన చెప్పారు. జవహర్ పార్టీ కోసం ఎంతగానో కష్టపడ్డారని దానికి గుర్తింపుగానే కమిషన్ ఛైర్మన్ పదవి జవహర్ కు దక్కిందన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఈ సందర్భంగా కేకే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యదర్శి యార్లగడ్డ శేఖర్, సర్వేజనా సుఖినో భవంతు స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ అడబాల వీరభద్ర రావు, వనమాడి ఉమాశంకర్, కాపవరపు జాను, బోస్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 21 నుంచి 24 వరకు సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపుకు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ట్రాఫిక్ మళ్లింపు

**కాకినాడ, (రాజధాని వార్తలు):** సామర్లకోట నుండి అచ్చంపేట వరకు నిర్మిస్తున్న భారత్ మాల జాతీయ రహదారి నిర్మాణపనుల్లో భాగంగా బ్రిడ్జిలకు గడ్డర్లు లేపుతున్న నేపథ్యంలో నెల 21 నుంచి 24 వరకు సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపుకు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సామర్లకోట రోడ్డు ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ పనులు 4 రోజులు ట్రాఫిక్ నిలుపుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా అచ్చంపేట నుంచి సామర్లకోట వరకు జరుగుతున్న రహదారి పనుల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్‌లో గడ్డర్లు లేపుతున్నందున ఈ నెల 27, 28 తేదీలలో (రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు) రెండు రోజుల పాటు ట్రాఫిక్ మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, వాహనదారులు గమనించి పోలీసు వారు సూచించిన మార్గాలలో తమ వాహనాలను నడుపుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు.

# వంశీ పైడిపల్లి ఇంత సైలెంట్ అయిపోయాడేంటో?




టాలీవుడ్‌లో జరిగిన మార్పుల గురించి చెప్పాల్సి వస్తే బాహుబలికి ముందు బాహుబలికి తరువాత అని చెప్పక తప్పదు. ఎందుకంటే బాహుబలి తరువాత తెలుగు సినిమా స్వరూపమే సమూలంగా మారిపోయింది. మార్కెట్ పెరిగింది. బడ్జెట్ కూడా పతాక స్థాయికి చేరింది. దీనికి తగ్గట్టుగానే సినిమాల బిజినెస్ కూతా పెరిగింది. చిన్న హీరో సినిమా కూడా ఇప్పుడు ఉత్తరాదిలోనూ సేల్ అవుతోందంటే దానికి కారణం బాహుబలి. అయితే ఇదే సినిమా కారణంగా కొంత మంది దర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ తరువాత ప్రతి హీరో టార్గెట్ పాన్ ఇండియా. దీంతో దర్శకులకు హీరోలు లభించని పరిస్థితి తలెత్తుతోంది. కొంత మంది తర్శకులు అందుబాటులో ఉన్న హీరోలతో సర్దుకుంటుంటే కొంతమంది దర్శకులు మాత్రం స్టార్ హీరోతో మాత్రమే సినిమా చేస్తానంటూ భీష్మించుకు కూర్చుంటున్నారు. ప్రస్తుతం స్టార్ హీరోలు చాలా వరకు పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లకు లాక్ అయిపోవడంతో సదరు దర్శకులకు పనిలేకుండా పోతోంది. దీంతో సినిమా చేసి ఏళ్లు గడుస్తున్నా మరో ప్రాజెక్ట్‌ని పట్టాలెక్కించలేకపోతున్నారు. ప్రస్తుతం ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు దర్శకుడు వంశీ పైడిపల్లి. దళపతి విజయ్ హీరోగా 2023లో వంశీ పైడిపల్లి చేసిన మూవీ వారీసు. తమిళంలో రూపొందించిన ఈ సినిమాని తెలుగులో వారసుడు పేరుతో రిలీజ్ చేయడం తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబట్టిన ఈ మూవీ విడుదలై రెండేళ్లు దాటింది. ఇంత వరకు వంశీ పైడిపల్లి నుంచి మరో ప్రాజెక్ట్‌కు సంబంధించిన అప్ డేట్ లేదు. బోయపాటి శ్రీను, పూరి జగన్నాథ్, కొరటాల శివ, శేఖర్ కమ్ముల, అనిల్ రావిపూడిలాంటి డైరెక్టర్లు సినిమాలు చేస్తున్నా వంశీ పైడిపల్లి మాత్రం ఇంత వరకు మరో ప్రాజెక్ట్‌ని ప్రకటించలేక సైలెంట్ అయిపోయాడు. తను కొత్త ప్రాజెక్ట్‌ని ప్రకటించకపోవడానికి కారణం స్టార్ హీరోలు ఎవరూ ఖాళీగా లేకపోవడమే. తనకు స్టార్ హీరో కావాలి. కానీ ఏ హీరో డేట్స్ ఖాళీగా లేవు. దీంతో తనకు కావాల్సిన హీరో డేట్స్ దొరికే వరకు కొత్త ప్రాజెక్ట్‌ని ప్రకటించే ఉద్దేశ్యం లేకపోవడంతో వంశీ పైడిపల్లి గత రెండేళ్లుగా సైలెంట్ అయ్యారని ఇన్ సైడ్ టాక్. వారీసు టైమ్‌లో మహేష్ తో సినిమా చేయాలని ప్రయత్నాలు చేశాడు కానీ తను చెప్పిన కథ మహేష్‌కు నచ్చకపోవడంతో ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత తమిళ హీరో విజయ్‌ని సంప్రదించడం, తను ఓకే చేయడంతో వారీసు తెరపైకొచ్చింది. మళ్లీ వంశీ పైడిపల్లి సినిమా చేయాలంటే తను కోరుకున్న స్టార్ హీరో డేట్స్ ఇవ్వాల్సిందే. అప్పుడు కానీ వంశీ మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశం లేదు.

# చార్మీ.. చాలా రోజుల తరువాత ఇలా..



టాలీవుడ్‌లో ఒకప్పుడు గ్లామరస్ హీరోయిన్‌గా వెలుగొందిన చార్మీ కౌర్, చాలా రోజుల తర్వాత తన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. తన 38వ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఈ ఫోటోను అప్‌లోడ్ చేసింది. చార్మీ ఈ ఫోటోలో ఎప్పటిలాగే అందంగా, ఎనర్జిటిక్‌గా కనిపించింది, ఆమె స్టైల్ అందరినీ ఆకర్షించింది. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అనుకోకుండా ఒక రోజు', 'లక్ష్మీ' సినిమాలతో ఒకప్పుడు హీరోయిన్‌గా టాలీవుడ్‌లో స్టార్‌డమ్ సంపాదించిన చార్మీ, 2015 తర్వాత నటనకు దూరమైంది. ఆమె నిర్మాతగా మారి, పూరి జగన్నాథ్‌తో కలిసి పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పలు సినిమాలను నిర్మించింది. నిర్మాతగా ఆమె విజయవంతమైన ప్రయాణం సాగుతున్నప్పటికీ, ఆమె నటనను మిస్ అవుతున్నామని అభిమానులు అంటున్నారు. చార్మీ చివరిసారిగా 2015లో 'మంత్ర 2' సినిమాతో నటిగా కనిపించింది. ఆ తర్వాత నటనకు పూర్తిగా దూరమై, నిర్మాణంపై దృష్టి సారించింది. అయితే, ఆమెకు ఇప్పటికీ నటనకు సంబంధించిన అవకాశాలు వస్తున్నాయని, కానీ ఆమె వాటిని సున్నితంగా తిరస్కరిస్తోందని సమాచారం. నిర్మాతగా ఆమె బిజీ షెడ్యూల్, కొత్త కథలపై ఫోకస్ ఆమెను నటనకు దూరంగా ఉంచుతున్నాయని టాక్. ఈ సందర్భంగా చార్మీ పుట్టినరోజు ఫోటో అభిమానులకు సర్‌ప్రైజ్‌గా నిలిచింది. ఆమె ఈ ఫోటోలో బ్లాక్ అండ్ వైట్ డ్రెస్‌లో అద్భుతంగా కనిపించింది, ఆమె అందం, స్టైల్ అందరినీ ఆకట్టుకుంది. "చార్మీ ఎప్పటిలాగే అద్భుతంగా ఉంది, మళ్లీ నటించాలని కోరుకుంటున్నాం" అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటో ఆమె పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ఓ చిన్న ట్రీట్‌గా నిలిచింది. చార్మీ నిర్మాతగా తన దృష్టిని కొనసాగిస్తున్నప్పటికీ, ఆమె నటనకు తిరిగి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆమె ఎనర్జిటిక్ పర్ఫామెన్స్‌లు, స్క్రీన్ ప్రెజెన్స్ ఇప్పటికీ అభిమానుల మదిలో నిలిచి ఉన్నాయి. ఆమె త్వరలో నటనలోకి రీఎంట్రీ ఇస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక నెక్స్ట్ నిర్మాతగా ఆమె విజయ్ సేతుపతి పూరి కాంబినేషన్ కోసం సిద్ధం అవుతున్నారు.

# నా రక్తం పతనం కోరుకుంటే.. ప్రభాస్ మాత్రం



మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' సినిమా జూన్ 27 విడుదల కానున్న విషయం తెలిసిందే. మహేశ్వరుడి భక్తుడు కన్నప్ప జీవిత ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమా విష్ణు కెరీర్ లోనే బిగ్గెస్ట్ మూవీ. 100 కోట్ల బడ్జెట్‌తో పాన్ ఇండియా క్రేజ్ కు తగ్గట్టుగా సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఇక సినిమాకు పాజిటివ్ హైప్ వచ్చేలా ప్రస్తుతం విష్ణు అమెరికాలో ఉంటూ, అభిమానులతో సమావేశాలు, ఇంటర్వ్యూల ద్వారా సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాలో ప్రధానంగా స్టార్ క్యాస్ట్ హైప్ క్రియేట్ చేస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నందీశ్వరుడి పాత్రలో కనిపించబోతున్నాడు. ఇక అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, కాజల్ అగర్వాల్ వంటి స్టార్ కాస్ట్ కీలక పాత్రల్లో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్షన్‌లో 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవిఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై ఈ సినిమా రూపొందుతోంది. విష్ణు కోసం గతంలో ప్రభాస్‌తో 'డేనికైనా రెడీ' సినిమాలో సర్‌ప్రైజ్ ఇచ్చాడు. ఒక ఫోన్ కాల్ సీన్ కోసం డబ్బింగ్ చెప్పాడు. ఇక తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో విష్ణు, ప్రభాస్‌తో తన సన్నిహిత సంబంధం గురించి మరింత ఎమోషనల్‌గా వివరణ ఇచ్చారు. విష్ణు మాట్లాడుతూ.. ప్రభాస్‌తో నాకు చాలా మంచి స్నేహ బంధం ఉంది, స్నేహపూర్వకంగా ఆయన్ని తిడతాను కూడా. ప్రభాస్ తను ఎంత పెద్ద స్టారో గుర్తించడు, ఎవరి గురించి పట్టించుకోడు, తన ప్రపంచంలో సంతోషంగా ఉంటాడు. కెరీర్ మొదటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మార్పు లేదు" అని విష్ణు అన్నాడు. అలాగే ప్రభాస్ సింప్లిసిటీ గురించి విష్ణు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ప్రభాస్‌కు నీవు ఎప్పటికీ మారకూడదని చెప్పాను, దానికి ఆయన నవ్వుతూ 'మారడానికి ఏం ఉంది, నేను ఎప్పుడూ ఇలాగే ఉంటాను కదా' అని అన్నాడు. అతనిలా జీవించడం చాలా అరుదు" అని విష్ణు పేర్కొన్నాడు. ప్రభాస్ ఆసియాలోనే అతిపెద్ద స్టార్‌లలో ఒకడిగా ఎదిగినప్పటికీ, అతని సింప్లిసిటీ అభిమానులను ఆకర్షిస్తుందని విష్ణు చెప్పాడు. తన కుటుంబంలో ఎదురవుతున్న సమస్యల గురించి కూడా విష్ణు భావోద్వేగంగా మాట్లాడాడు. "రక్తం పంచుకొని పుట్టిన వారే నా పతనం కోరుకుంటే.. ప్రభాస్ మాత్రం నేను సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాడు. మూడు లేదా ఆరు నెలలకు ఒకసారి కలిస్తే, మన స్నేహం ఎప్పటికీ ఉంటుందని, మనం భిన్నమైన జీవన శైలి నుంచి వచ్చామని ఆయన అన్నాడు" అని విష్ణు తన వివరణను వ్యక్తం చేశాడు. ఇక 'కన్నప్ప' సినిమా శివ భక్తుడైన కన్నప్ప కథ ఆధారంగా రూపొందుతోంది. ఈ సినిమాలో ప్రభాస్ నంది పాత్రలో, అక్షయ్ కుమార్ శివుడిగా, కాజల్ అగర్వాల్ పార్వతిగా కనిపించనున్నారు. మోహన్‌లాల్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు.

# 'దేవర 2' బిగ్ అప్డేడ్ !



ఈనెల 20న యంగ్ టైగర్ ఎన్టీఆర్ బర్త్ డే. పాన్ ఇండియాలో అభిమానులు పెద్ద ఎత్తున సెలబ్రేషన్లు ప్లాన్ చేస్తున్నారు. ఓ పెద్ద పండగలా ఆ రోజును సెలబ్రేట్ చేసుకోవడానికి రెడీ అవు తున్నారు. ప్రతిగా ఆ రోజు వార్ -2 సహా డ్రాగన్‌కి సంబంధించిన అప్ డేట్స్‌తోనూ తారక్ ఖుషీ చేసే అవకాశం ఉంది. రెండు ఆన్ సెట్స్‌లో ఉన్న చిత్రాలు కాబట్టి ఇలాంటి స్పెషల్ ప్లానింగ్ తప్పని సరి. చిత్ర హీరోకు ఆ రకంగా విషెస్ చెప్పడం చాలా కాలంగా ఆచరణలో ఉంది. కానీ కొరటాల మాత్రం మ్యూట్‌లో ఉన్నా? కానీ ఆ రోజు ఆయన కూడా బిగ్ అప్‌డేట్ ఇవ్వబోతున్నారని సన్నిహిత వర్గాల సమాచారం. దేవర 2 చిత్రానికి సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందించబోతున్నారుట. అది స్టోరీకి సంబంధించిన అప్ డేట్ అయి ఉండొచ్చని తెలుస్తోంది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన దేవర డివైడ్ టాక్‌తో ఆడింది. అయినా పాన్ ఇండియాలో బాక్సాఫీస్ వద్ద ఆ సినిమా దూకుడు ఎక్కడా తగ్గలేదు. రివ్యూలు నెగిటివ్‌గా వచ్చినా? ఆ ప్రభావం పెద్దగా పడలేదు.

అయితే తారక్ దేవర2ని పక్కనబెట్టి కొత్త చిత్రాలు తెరపైకి తేవడంతో దేవర 2 లేనట్లేనని ప్రచారం బలంగా జరిగింది. బాక్సాఫీస్ లెక్కలన్నీ తప్పులు తడక కాబట్టే తారక్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని తారక్ ఖండించాడు. దేవర 2 కచ్చితంగా ఉంటుందని...తామే కావాలని కొంత గ్యాప్ తీసుకుంటున్నట్లు ప్రకటించడంతో క్లారిటీ వచ్చింది. కంటిన్యూగా కొరటాల కూడా రెండవ భాగం మరింత బలంగా ఉంటుందని స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఇదంతా జరిగి కొన్ని నెలలవుతుంది. దేవర రిలీజ్ నుంచి కొరటాల రెండవ భాగం స్టోరీ పనుల్లోనే బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్టోరీకి సబంబంధించి ఓ కొలిక్కి రావడంతో తారక్ బర్త్ డేకి అప్డేట్ ఇచ్చే ప్లాన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రతి ఇంటిలో మొక్కలు పెంచాలి

## - వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్










**అనకాపల్లి (సబ్బవరం), (రాజధాని వార్తలు):** ఇళ్లు, పరిసర ప్రాంతాలలో మొక్కలు పెంచుట ద్వారా వాతావరణ ఉష్ణోగ్రతలు తగ్గించుటకు కృషిచేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈ నెలలో బీట్ ది హీట్ నినాదంతో నిర్వహించారు. శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సబ్బవరం మండలం బాటజంగాలపాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాలలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ప్రయాణికులు, బాటసారుల కొరకు ఏర్పాటు చేసిన వేసవి షెల్టరు కేంద్రాన్ని జిల్లా కలెక్టరు ప్రారంభించారు. అనంతరం ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన వైద్యశిబిరం పరిశీలించారు. ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమం గూర్చి, వైద్య సేవలు గూర్చి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో మాతృమరణాలు ఎక్కువగా ఉన్నాయని, హైరిస్కు గల కేసులను నిత్యం పర్యవేక్షించాలని, మాతాశిశు మరణాలు సంబవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పశువుల దాహార్తిని తీర్చుటకు ఏర్పాటుచెసిన నీటికుండీని ప్రారంబించారు. నీటికుండీలో నిత్యం నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేసారు. కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని, కేంద్రంలో తయారైన ఎరువులను విక్రయించుటకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటి వద్దనే చెత్తను నిల్వ చేసే చెత్తకుంటను ప్రారంభించి సక్రమంగా వినియోగించుకోవలసినదిగా గ్రామస్తులకు తెలియజేసారు. కార్యక్రమంలో భాగంగా కేన్సర్ టెస్టింగు సెంటరులో మొక్కలు నాటారు. ఈ సంధర్బంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. భౌగోళిక మార్పుల కారణంగా వాతావరణంలో విపరీతంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పర్యావరణం కాపాడుకొనుటకు తీసుకోవలసిన చర్యలు గూర్చి ప్రజలలో చర్చ జరగాన్నారు. ఎండలో బయట తిరగకూడదని, ఎండ నుండి రక్షణకు గొడుగు లేదా టోపీ వాడాలని, నీరు ఎక్కువగా త్రాగాలని తెలిపారు. వైద్య సిబ్బంది అందించే సూచనలు, సలహాలు పాంటించాలన్నారు. ఎవరికైనా వడదెబ్బ తగిలితే వెంటనే వెద్యం అందించాలని సూచించారు. ముందు జాగ్రత్తలు తీసుకొనుట ద్వారా వడదెబ్బ మరణాలను నివారించవచ్చని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకొనుటకు, ఉష్ణోగ్రతలు తగ్గించుటకు ప్రతి ఒక్కరు వారివంతు సహకారం అందించాలని తెలిపారు. గ్రామస్తులు చెత్తను కాలువలు, రోడ్డుపై వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందించాలని, సంపద సృష్టి కేంద్రాలలో వాటిని ఎరువులుగా మార్చి వినియోగించాలని తెలిపారు. వాతావరణ సమతుల్యానికి, ఉష్ణోగ్రతలు తగ్గుటకు మొక్కలు విరివిగా నాటాలని, ప్రతి ఇంటిలో కనీసం పది మొక్కలు పెంచుకోవాలని అన్నారు. పక్షులకు కూడా దాహార్తిని తీర్చేలా నీటిని అందుబాటులో ఉండేలా కుండీలలో నీరు ఏర్పాటుచేయాలని విద్యార్థులకు సూచించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సి.ఇ.ఒ. కె.రాజుకుమార్, మండల పత్యేక అధికారి కె.రమామణి, జిల్లా పంచాయతీ అదికారి ఆర్. శిరీషారాణి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటరు జిల్లా కో ఆర్డినేటరు ఇ.నాగలక్ష్మి, తహశీల్దారు బి.చిన్నికృష్ణ, మండల అభివృద్ధి అధికారి పి. పద్మజ, మెడికల్ అధికారి డా.సిహచ్. ఆశ, ఎన్ అర్ ఇ జి ఎస్ ఎపిడి జె.మణికుమార్, సర్పంచ్ పడాల వెంకటరమణ, బిజేపి జిల్లా ఉపాధ్యక్షులు వనం సత్యనారాయణ, ఇతర సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# ఫస్ట్ ఫేస్‌లోనే సిటీ నుండి లంకెలపాలెం వరకు మెట్రో ట్రైన్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలి

## - ఎం ఆర్ డి ఏ చైర్మన్‌కి వినతి పత్రం అందజేసిన అగనంపూడి టిడిపి నాయకులు



**అగనంపూడి, (రాజధాని వార్తలు):** వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్‌ని జీవీఎంసీ 85వ వార్డు ఇంచార్జ్ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాదు ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ విశాఖ పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి కసిపెల్లి శ్రీనివాసరావు కలిసి ఫార్మాసిటీ 130 కంపెనీలో సుమారు 25 వేల మంది ఉద్యోగులు ప్రతిరోజు సిటీ నుండి ట్రావెల్స్‌లో వస్తున్నారని ఆ ట్రావెల్స్ రద్దీతో ట్రాఫిక్ ప్రాబ్లం మరియు కాలుష్యం విపరీతంగా వస్తుందని, అగనంపూడి టాటా హెూమి బాబా క్యాన్సర్ ఆస్పత్రికి ఇతర రాష్ట్రాల నుండి వాల్తేరు రైల్వే స్టేషన్లో దిగి పలు ఇబ్బందులు పడి ఆసుపత్రికి పేషంట్స్ వస్తున్నారని కావున సిటీ నుండి లంకెలపాలెం వరకు ఫస్ట్ ఫేసులోనే మెట్రో ట్రైన్‌ను ఏర్పాటు చేయుటకు తగు ప్రతిపాదనలు తీసుకోవాలని, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ ఆధీనంలో కాపులకు భవన నిర్మాణం ఎకరా భూమి కేటాయిస్తే వైయస్సార్సీపి ప్రభుత్వ హాయంలో 50 సెంట్లుకే కుదించిందని కూటమి ప్రభుత్వ హయాంలో కాపు భవనం నిర్మాణం చేస్తామని తమరు హామీ ఇచ్చినందుకు కాపుల తరుపున వర్షం వ్యక్తపరుస్తున్నాము అన్నారు.

# తప్పుడు ప్రచారాలు మానుకోండి : జనసేనకు వైకాపా నేతల హెచ్చరిక



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** జనసేన నాయకులు ఉల్లి సీతారాం, కిముడు కృష్ణమూర్తి చేసిన విమర్శలను వైఎస్సార్సీపీ గిరిజన నేతలు తీవ్రంగా ఖండించారు. మా పార్టీని, నాయకులను విమర్శించే అర్హత జనసేన నేతలకు లేదని వారు విమర్శించారు. మా పార్టీకి చెందిన నాయకులను కండువాలు కప్పి తమ పార్టీకి చేర్చుకున్నట్టు తప్పుదోవ పట్టే ప్రకటనలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. వైఎస్సార్సీపీ గిరిజన నేతలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పార్టీ అధికారంలో లేకపోయినా నైతికత, నిజాయితీ, సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని పేర్కొన్నారు. ఈవీఎంల గాలి వీచినా ఇద్దరు శాసన సభ్యులను, ఒక పార్లమెంటు సభ్యుణ్ని గెలిపించగలిగామని గుర్తు చేశారు. కూటములు ఎన్ని ఏర్పడ్డా గిరిజన ప్రాంతాల్లో వైఎస్సార్సీపీకి సంపూర్ణ మద్దతే లభిస్తుందని తెలిపారు. మా పార్టీపై వ్యాఖ్యలు చేయాలంటే ముందు తగిన స్థాయిని సాధించాలంటూ జనసేన నేతలపై వ్యంగ్యంగా స్పందించారు. తప్పుడు ప్రచారాలను విరమించాలని, చేతనైతే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ ఎం.లోవరాజు, వార్డు నంబర్ పొట్టిక లక్ష్మణ్, పార్టీ కార్యకర్తలు పిండి రమణ, బొండా బుజ్జి బాబు పాల్గొన్నారు.

# సాలాపువానిపాలెంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర : మాదంశెట్టి నీలబాబు



**విశాఖ, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన ఆదేశాల మేరకు మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని 84వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో సాలాపువానిపాలెం గ్రామంలో ఈరోజు ఉదయం కూటమి కార్యకర్తలు గ్రామ ప్రజలతో కలిసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని రోడ్డుపై చెత్తలు మట్టి ఇసుక వంటివి ఉండకుండా ప్రతి పౌరుడు బాధ్యతగా మనం ఉన్న ప్రాంతాల్ని పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని లేకపోతే అనారోగ్యానికి గురి కావాల్సి ఉంటుందని, అందువల్లే ప్రభుత్వం మూడవ శనివారం ఏదో ఒక ప్రాంతంలో ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రజలను భాగస్వామ్యం చేసి ప్రజల్లో చైతన్యం కలిగించినట్లయితే ప్రభుత్వం ఉద్దేశం నెరవేరునట్లు అవుతుందని దానికి మన అందరం సహకరించినట్లయితే గ్రామాల్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండడం వల్ల ప్రభుత్వం గుర్తించి మరిన్ని నిధులు కేటాయించడానికి అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా నీలబాబు ప్రజలను కార్యకర్తలు నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాలాపు మోహన్ సాలాపు నాగరాజు సాలాపు రమణ సాలాపు సుమన్ అప్రెంటిస్ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత

## - 15 మందికి రూ.5,65,469లు మంజూరు - చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు




**ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాదు లబ్ధిదారులకు అందజేశారు. జి.కొండూరు మండలంలోని 15 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.5,65,469లు మంజూరయ్యాయి. ఈ సాయాన్ని శాసన సభ్యులు కృష్ణప్రసాదు లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశారు. సీఎం చంద్రబాబు సందేశ పత్రాలను కూడా వారికి అందజేశారు. లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ఈ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాదుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan